
సాక్షి ఒడిశా

మంగళవారం । 20 । జూన్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,06,754లు, బంగారం 750 మిల్లీ గ్రాములు, వెండి 37.8 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



విశ్వవిఖ్యాత.. యాత్రకు వేళాయె

- 8లో.



కళాకారులకు ప్రభుత్వం చేయూత

- 8లో.

న్యూస్‌రీల్

యోగా దినోత్సవానికి ఏర్పాట్లు



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

పర్లాకిమిడి: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు పతంజలి యోగా సమితి, భారత్ స్వాభిమాన్ సంస్థలు, స్థానిక శ్రీధర్‌నగర్, సీసీడీ సంస్థ కార్యాలయంలో సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈనెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యచరణపై పతంజలి యోగా సమితి జిల్లా కో–ఆర్డినేటర్ బిఘ్నేశ్వర దాస్, పతంజలి కిసాన్ సేవాసమితి అధ్యక్షుడు ఎ.జగన్నాథరాజు, సంజయ్ జెన్నా, సురేంద్రనాథ్ రథొ, జిల్లా ప్రభారి సుశాంత్ మహాపాత్రొ, భీమారావు తదితరులు చర్చించారు. జిల్లాలో కాశీనగర్, గుమ్మా సీహెచ్‌సీ, రాయఘడ, ఆర్.ఉదయగిరి తోపాటు పర్లాకిమిడి సరస్వతీ శిశు విద్యామందిర్, బాయ్స్ హైస్కూల్, కృచంద్ర గజపతి కళాశాల, బెత్తగుడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంతాల్లో యోగా శిబిరాలు ఏర్పాటుకు సమావేశంలో నిర్ణయించినట్లు బిఘ్నేశ్వర్ దాస్ తెలిపారు.

గంజాయితో వ్యక్తి అరెస్ట్



గంజాయితో పోలీసుల అదుపులో నిందితుడు

రాయగడ: స్థానిక రైల్వేస్టేషన్ ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తి నుంచి ఎక్సైజ్‌శాఖ సిబ్బంది 21కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ అధికారి అభిరాం బెహరా సోమవారం తెలిపారు. నిందితుడు సుందర్‌ఘడ్ జిల్లాలోని విశ్రాకు చెందిన సరోజ్ రామ్(32)గా గుర్తించారు. ఐఐసీ సంజయ్ ప్రధాన్ నేతృత్వంలో పట్టణంలో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో రాయగడ రైల్వేస్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు సిబ్బంది గుర్తించడంతో పాటు అతని వద్ద నుంచి గంజాయి సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న సరుకు విలువ రూ.2 లక్షల వరకు ఉంటుందని వివరించారు.

ప్రదీప్ మాఝి చేసిందేమీ లేదు



మీడియాతో మాట్లాడుతున్న మున్నా త్రిపాఠి

కొరాపుట్: రాష్ట్ర స్వతంత్ర అభివృద్ధి మండలి సలహాదారుడు ప్రదీప్ మాఝి ఆదివాసీలకు చేసిందేమి లేదని నవరంగ్‌పూర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మనోరంజన్ త్రిపాఠి(మున్నా) విమర్శించారు. జిల్లా కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌లో ఉన్న గిరిజన నాయకులతో కలిసి రోడ్డుపై ఇలా మాట్లాడటం తన నిరసనలో భాగమన్నారు. ఎస్‌డీసీ పదవి దక్కడం ప్రదీప్‌కు లాభం చేకూర్చుతుంది తప్ప.. ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేదని ఆక్షేపించారు. తన రాజకీయ జీవితంలో ఎంపీ, జిల్లా పరిషత్ అధ్యక్షుడిగా పనిచేసిన ఆయన.. గిరిజనులకు ఏం చేశారని ప్రశ్నించారు. అదేవిధంగా ఆదివాసీల తరుపున మంత్రి హోదాలో ఉన్న సాంఘిక సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సారక కూడా కేవలం ప్రారంభోత్సవాలకే పరిమితయ్యారని ఆరోపించారు.

పర్లాకిమిడిలో సంగీత విద్యాలయం



సంగీత విద్యాలయాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ నిర్మలాశెఠి

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని టౌన్ హాలు సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల పాత భవనంలో సంగీత విద్యాలయాన్ని మున్సిపల్ చైర్మన్ నిర్మలాశెఠి సోమవారం ప్రారంభించారు. మహంత రామానంద దాస్, సంగీత దర్శకులు, శిక్షకులు రఘునాథ పాత్రొ, జిల్లా సాంస్కృతికశాఖ అధికారి అర్చనా మంగరాజ్, భక్తిసంగీత సంసద్ కార్యదర్శి రథొ, మున్సిపల్ ఈఓ వనమాళి శత్పతి తదితరులు పాల్గొన్నారు. పర్లాకిమిడిలో సంగీత విద్యాలయ భవనం ఏర్పాటు కావడంపై రఘునాథ పాత్రొ, సంగీత ప్రియులు ఆనందం వ్యక్తం చేశారు.

ఇంకా.. తెలవారదేమీ..!

ఏడాదంతా ఎదురు చూసే సమయం రానే వచ్చింది. భక్తుల తన్మయత్వం నడుమ.. జగన్నాథుని నవ దినాత్మక రథయాత్ర మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. తెల్లారే సరికి పూరీ పట్టణం.. లక్షలాది మంది భక్తులతో కిటకిడలాడనుంది. అలాగే బొడొదండొ యాత్రికుల ఆగమనంతో శ్రీమందిరం ప్రాంగణం కళకళలాడుతోంది. రాష్ట్రప్రభుత్వం, పూరీ జిల్లా యంత్రాంగం, ఆలయ పాలకవర్గం ప్రసిద్ధ జగన్నాథుని వార్షిక యాత్రకు ఏర్పాట్లు పూర్తి చేసింది.

– భువనేశ్వర్



- నేడు పూరీ జగన్నాథుని వార్షిక రథయాత్ర
- ఉదయం 9.30 నుంచి పొహండి ప్రారంభం
- అలంకరణ అనంతరం సాయంత్రం 4 గంటలకు యాత్ర
- దాదాపు 15లక్షల మంది యాత్రికులు పాల్గొనున్నట్లు అంచనా

మంగళవారం ఉదయం 9.30 గంటలకు మూల విరాట్‌ల తరలింపు(పొహండి) ప్రారంభమవుతుంది. గర్భాలయం నుంచి రథాల పైకి చతుర్ధా మూర్తులు చేరేంత వరకు ఈ ప్రక్రియ నిరవధికంగా కొనసాగుతుంది. మధ్యాహ్నం 12.30 గంటలకు పొహండి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒంటి గంట వరకు మదన్మోహన్, శ్రీరాముడు, శ్రీకృష్ణుడు విజే, 1.30 నుంచి 2.30 గంటల వరకు చిత్తా లగ్గి, అలంకరణ అనంతరం 2.30 నుంచి 3.30 గంటల వరకు ఛెరా పొహొరా, చారుమళ్ల తొలగించి కొయ్య గుర్రాలు అమర్చి రథాలు లాగేందుకు సిద్ధం చేస్తారు. సాయంత్రం 4 గంటలకు గుండిచా మందిరం వైపు మూడు రథాలు బయలుదేరుతాయి. యాత్ర పురస్కరించుకుని జగన్నాథ ఆలయ పరిపాలన(సేవా విభాగం) పూజలు, సేవాదులు కార్యక్రమం వివరాలు జారీ చేసింది. ఉదయం 6 గంటలకు మంగళ హారతితో ఈ కార్యక్రమాలు ప్రారంభమవుతాయి.

సీఎస్ ప్రత్యక్ష పర్యవేక్షణ..

యాత్ర ఆద్యంతాలు జయప్రదం చేసేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ జెనా శ్రీమందిరం ప్రాంగణంలో పాగా వేశారు. ప్రతి పనినీ ప్రత్యక్షంగా సమీక్షిస్తున్నారు. ప్రధానంగా వేధిస్తున్న ఉక్కపోత వాతావరణం నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ప్రత్యేకంగా శ్రద్ధ వహిస్తున్నారు. అగ్నిమాపక దళం జన సందోహంపై చన్నీటి సించనం నిరవధికంగా చేపడుతుందని, అడుగడుగునా ఓఆర్ఎస్ పంపిణీ కొనసాగుతుందని సీఎస్ పేర్కొన్నారు.

వడదెబ్బ నివారణకు ప్రత్యేక చర్యలు..

యాత్రికులపై వేడి వాతావరణం ప్రభావాల నివారణకు అగ్నిమాపక దళం పూర్తిస్థాయి జాగ్రత్తలు తీసుకుంటోందని విభాగం డైరెక్టర్ జనరల్ సుధాంశుకుమార్ షడంగి తెలిపారు. యాత్ర జరిగే బొడొదండొ మార్గంలో శ్రీమందిరం నుంచి గుండిచా మందిరం వరకు దారి పొడవునా 21 నీటి సించన వాహనాలు ఏర్పాటు చేస్తున్నారు. పొహొండి ప్రక్రియలో పాలుపంచుకునే సేవకులు, యాత్రికుల పాదాలు నేల వేడికి గురికాకుండా ఈ ప్రక్రియ నిరవధికంగా నిర్వహిస్తారు. దీని కోసం ఒక్కో రథం ప్రాంగణంలో 4 చొప్పున నీటి సించనం ట్యాంకర్లు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో నీరు ఖాళీ అయితే ప్రజారోగ్య శాఖ ఆధ్వర్యంలో భారీ ట్యాంకర్‌తో నీటిని రప్పించి భర్తీ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సొమ్మసిల్లడం వంటి అనారోగ్య పరిస్థితుల నిర్వహణకు 50 స్ట్రెచ్చర్ల బృందం, ఆకస్మిక అగ్నిప్రమాదాల నియంత్రణకు 4 యూనిట్ల ప్రత్యేక దళాలను నియమించారు.

కోస్టుగార్డు పహారా..

తొలిసారిగా రథయాత్రలో శాంతిభద్రతల పరిరక్షణ నేపథ్యంలో కోస్టుగార్డ్ హెలీకాప్టర్ ఆకాశ మార్గంలో పహారా ఏర్పాటు చేసినట్లు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(శాంతిభద్రతలు) సంజయకుమార్ తెలిపారు. పారాదీప్ తీరంలో నిఘా ఓడలు అందుబాటులో ఉంటాయని, జూలై 2వరకు ఈ వ్యవస్థ కొనసాగుతుందని వెల్లడించారు. డ్రోన్ కెమెరాల అనుసంధానంతో యాత్ర కంట్రోల్‌రూమ్ సీసీటీవీ కెమెరాల వ్యవస్థను పర్యవేక్షిస్తుందన్నారు.

చల్ల చల్లగా..

జగన్నాథుని రథయాత్ర అహ్లాదకరమైన వాతావరణంలో కొనసాగుతుందని వాతావరణ విభాగం చల్లని కబురు వినిపించింది. వడదెబ్బ వంటి వైపరిత్యాల పట్ల తల్లడిల్లుతున్న సాధారణ ప్రజానీకం, నిర్వహణ యంత్రాంగానికి ఈ ప్రకటన ఊరట కలిగించింది. రాష్ట్రంలోకి రుతుపవనాల చొరబాటుకు అనుకూల వాతావరణం నెలకొని ఉన్నందున యాత్ర సమయంలో వానకురిసే అవకాశం ఉందని సమాచారం వెల్లడించింది. ఆకాశం మేఘావృతమై ఉండడంతో ఉక్కపోత వంటి అసౌకర్య పరిస్థితులు తొలగి పోతాయని తెలిపింది. పగటిపూట ఉష్ణోగ్రత 3 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశం ఉందని, అలాగే 21న అత్యధిక జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురుస్తాయని ప్రకటించింది. ఈనెల 22న రాష్ట్రంలో పలు జిల్లాల్లో అధికంగా వర్షం కురిసే వాతావరణం అలుముకుంటుంది. ఈ నేపథ్యంలో రథయాత్ర సమయంలో వాతావరణం చల్లబడే అవకాశం ఉన్నట్లు వాతావరణ విభాగం అంచనా వేస్తున్నారు.

సింహద్వారం ముంగిటకు రథాలు

జగన్నాథుని రాక కోసం శ్రీమందిరం సింహద్వారం ముంగిట రథాలు నిరీక్షిస్తున్నాయి. తయారీ ప్రాంగణం నుంచి సింహద్వారం వైపు తిప్పేందుకు దక్షిణ మలుపు కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేశారు. సోమవారం సాయంత్రానికి శ్రీమందిరం ఆలయం ఆవరణలో ముస్తాబైన 3 రథాలను క్రమ పద్ధతిలో తరలించారు. ద్వితీయ భోగ మండప సేవ ముగిసిన అనంతరం పూజా పండా సేవకుల ఆధ్వర్యంలో ఆజ్ఞా మాలలతో కార్యాలయం ఆవరణలో నిలిచి ఉన్న రథాలకు పూజలు నిర్వహించి, మలుపు తిప్పడం ప్రారంభించారు. మరోవైపు యాత్ర సందర్భంగా మారుమూల ప్రాంతాల నుంచి అశేష సంఖ్యలో భక్తులు, యాత్రికులు తరలి రానున్నారు. ఇసుక వేస్తే రాలనంత జన సందోహంలో ఉక్కపోత, ఊపిరాడక ఉక్కిరి బిక్కిరయ్యే విపత్కర పరిస్థితుల నివారణ పట్ల అధికారుల యంత్రాంగం ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. వడదెబ్బ నివారణకు పటిష్టమైన చర్యలు చపట్టాలని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆదేశించారు. ఈ మేరకు పూరీ జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోంది. అలాగే ఈ ఏడాది దాదాపు 15లక్షలకు పైగా యాత్రికులు వచ్చే అవకాశాలు ఉన్నాయని అంచనా. ఈ లెక్కన 50లక్షల నీటి సీసాలు పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేశారు. యాత్ర ప్రాంగణంలో శ్రీమందిరం నుంచి గుండిచా మందిరం వరకు బొడొదండొలో దారి పొడవునా చన్నీటి సించనం నిరవధికంగా కొనసాగుతుందని అధికార వర్గాలు తెలిపాయి.



జగన్నాథుని నందిఘోష్‌ను మలుపు తిప్పుతున్న జవాన్లు

రథయాత్ర షెడ్యూల్ ఇలా..

కార్యక్రమం	సమయం(గంటల్లో)
మైలమ్	6.10
తొడొపా లగ్గి	6.30
రోష హోమం	7.00
సూర్య పూజ	7.10
ద్వారపాలకుల పూజ, అలంకరణ	7.30
గోపాల్ వల్లభ్, ధూపం (ఖేచుడి భోగం)	8 నుంచి 9 వరకు
రథ ప్రతిష్ట	9.00
మంగళార్పణం	9.15
పొహండి ఆరంభం	9.30
పొహండి ముగింపు	మధ్యాహ్నం12.30
ఉత్సవమూర్తుల తరలింపు	12.30 నుంచి ఒంటి గంట వరకు
చిత్తా అలంకరణ	1.30 నుంచి 2 గంటల వరకు
అలంకరణ	2 నుంచి 2.30 గంటల వరకు
ఛెరా పొంహొరా	2.30 నుంచి 3.30 గంటల వరకు
చారుమళ్ల తొలగింపు, గుర్రాల అమరిక	3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు
రథాలు లాగడం ఆరంభం	సాయంత్రం 4 గంటల నుంచి

నయనోత్సవం..

భువనేశ్వర్: శ్రీమందిరం రత్నవేదికపై పక్షం రోజుల పాటు స్వామి దర్శనం కోసం తహతహలాడిన భక్తజన హృదయాలు పులకించి పోయాయి. గోప్య సేవల మండపం వీడి, నవ యవ్వనుడుగా జగన్నాథుడు భక్తుల కనుల ఎదుట ప్రత్యక్షమయ్యాడు. అస్వస్థతకు గురైన స్వామి రూపురేఖల పట్ల నెలకొన్న సందిగ్ధత తొలగి పోవడంతో భక్తులు నయనోత్సవం అనుభూతితో తన్మయులయ్యారు. సోమవారం జరిగిన జగన్నాథుని నవయవ్వన దర్శనానికి ఈ ఏడాది లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. పటిష్టమైన ఏర్పాట్లు మధ్య భక్తులకు సంతృప్తికర దర్శన సౌకర్యం కల్పించారు.

పరిమితంగా.. పరమాణికం

నవయవ్వన దర్శనం పురస్కరించుకుని పరమాణిక్(ఆర్జితం) దర్శన సౌకర్యం కల్పించారు. అయితే ఈ దర్శనం 30 నిముషాలు మాత్రమే పరిమితం చేశారు. ఉదయం 7.30 గంటల నుంచి 8 గంటల వరకు ఈ దర్శనం కొనసాగింది. ఒక రోజు ముందుగా ఒక్కో టికెట్ రూ.100 చొప్పున 7వేల పరమాణిక్ టిక్కెట్లు విడుదల చేశారు. శ్రీమందిరం దక్షిణ ద్వారం మీదుగా దర్శనం కోసం వారిని లోపలికి అనుమతించారు. అతిరథ మహారథులకు(వీవీఐపీ) పరమాణిక్ టికెట్లు పొందిన వారితో కలిపి స్వల్ప నిడివిలో ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం సర్వదర్శనం ఏర్పాటు చేశారు. శ్రీమందిరం సింహద్వారం ఆవరణలో నిరీక్షించిన భక్తులు, యాత్రికులకు సర్వ దర్శనానికి అనుమతించారు. ఈ దర్శనం ఉదయం 8 గంటల నుంచే ప్రారంభించారు. గతంలో ప్రకటించిన సమయానికి కంటే గంట ముందుగా ప్రారంభించి సుమారు గంటన్నర సేపు అధికంగా సర్వ దర్శనానికి అనుమతించడం విశేషం. పరమాణిక్ దర్శనం నిడివి కుదించి, సర్వదర్శనం నిడివి పెంచారు.

చిత్రపటాల దర్శనం ముగింపు..

జ్యేష్ట పూర్ణిమ పురస్కరించుకుని స్వామి తెర మరుగు కావడంతో నిత్యం వచ్చిపోయే భక్తులు, యాత్రికుల కోసం చిత్ర పటాలతో దైవదర్శనం కలిపించారు. నేత్రోత్సవంతో మూల విరాట్‌లు ప్రత్యక్షం కావడంతో చిత్ర పటాలు తొలగించారు. నేత్రోత్సవం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం జరగాల్సిన నిత్య పూజాదులను చిత్ర పటాల దేవుళ్లకు నిర్వహించారు. ఉదయం 6.45 గంటలకు మంగళ హారతితో చిత్ర పటాలకు సేవాదులు ప్రారంభించి సుమారు అరగంటలో ఈ ప్రక్రియ ముగించారు. అనంతరం 7.30 గంటల ప్రాంతంలో తడకలతో అమర్చిన దేవుళ్ల చిత్ర పటాలను తొలగించి, మూల విరాట్‌ల ప్రత్యక్ష దర్శన సౌలభ్యం కల్పించారు. నవయవ్వన దర్శనం కోసం భక్తుల తాకిడి పుంజుకుంది. ఉదయం 7.03 గంటల నుంచి నవయవ్వన రూపంతో భక్తులకు దర్శనమిచ్చి స్వామివారు మురిపించారు. ఉభయ పరమాణిక్, సాధారణ భక్తులకు శ్రీమందిరం భిత్రొ రొ కఠొ ప్రాంగణం నుంచి లఘుదర్శన సౌకర్యం కల్పించారు. ఉదయం 11.20 గంటలతో దర్శనం నిలిపి వేశారు. మూల విరాట్‌ల దర్శనం మినహా శ్రీమందిరం ప్రాకార ప్రదక్షిణకు నిరవధికంగా అనుమతించారు. ఈమేరకు అధికార యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.



జగన్నాథుని ప్రతిమూర్తిగా పూజలందుకున్న నారాయణుని తడక చిత్రపటం



నారాయణునికి మంగళ హారతి

‘పరిమళ’లో జిల్లా గ్రీవెన్స్



గ్రీవెన్స్‌కు హాజరైన కలెక్టర్ లింగరాజ్ పండా, ఎస్పీ స్వాతి



లబ్ధిదారులకు ఇల్లు, భూమి పట్టాలు పంపిణీ చేస్తున్న అధికారులు

- పలువురు లబ్ధిదారులకు భూమి పట్టాలు పంపిణీ

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని నువాగడ బ్లాక్ పరిమళ గ్రామ పంచాయతీ కార్యాలయంలో జిల్లా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని కలెక్టర్ లింగరాజ్ పండా అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. గ్రామముఖి పరిపాలన, ప్రజా వినతులు కార్యక్రమానికి జిల్లా ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, డీఆర్‌డీఏ ముఖ్య కార్యనిర్వాహణాధికారి రమాంచల్ ఖమారీ, బీడీఓ లోకనాథ శొబొరొ తదితరులు హాజరయ్యారు. స్పందన మొత్తం 55 వినతులు అందగా.. వాటిలో 10 వినతులకు అక్కడికక్కడే పరిష్కారం చూపారు. మిగతా వాటిలో 21 వ్యక్తిగతం, మరో 24 గ్రామ సమస్యలపై ఫిర్యాదులు ఉన్నాయని అధికారులు తెలిపారు. అలాగే ఏడుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థికసాయం అందించారు. స్పందనలో సామాజిక సురక్ష, భూమి, ఇళ్ల పట్టాలు, ఇతర అభియోగాలు కిరమా, పరిమళ గ్రామ పంచాయతీల నుంచి అందాయి. అనంతరం పలువురు లబ్ధిదారులకు భూమి, ఇళ్ల పట్టాలను అధికారులు పంపిణీ చేశారు. గ్రీవెన్స్‌లో నువాగడ సమితి అధ్యక్షురాలు మాలతీ ప్రధాన్, తహసీల్దార్ ఖురేషీచంద్ర జన్ని తదితరులు పాల్గొన్నారు.


తీరాన్ని తాకిన నైరుతి..

- రాష్ట్రంలోకి రుతుపవనాల ప్రవేశం

బరంపురం: కేరళలో దాదాపు 15రోజుల క్రితం ప్రారంభమై, వారం క్రితం ఆంధ్రప్రదేశ్‌ను చేరుకున్న నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకాయి. దోబూచులాట నడుమ ఎట్టకేలకు గంజాం జిల్లా గోపాల్‌పూర్ సముద్ర తీరం వెంట మోహరించాయి. ఈ తరుణంలో ఆసియాలోనే అతి పెద్దదైన చిలికా సరస్సుపై ఆకాశంలో నల్లని మబ్బులు కమ్ముకొని సరికొత్త అందాలతో పర్యాటక ప్రియులను ఆకట్టుకున్నాయి. సరస్సు మధ్య ఉన్న శరణ్, చోడైహోగా, మంగళాజోడి, నలబాను, కాళీజై, బరికుద్, బ్రేక్‌ఫాస్ట్ దీవులతో పాటు సుమారు 150 చిన్నచిన్న దీవులపై మేఘాలు కమ్ముకొని ప్రకృతి అందాలతో కట్టి పడేస్తున్నాయి. మరో 2, 3 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే అవకాశం ఉండటంతో ఖరీఫ్ రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

రానున్న 2, 3 రోజుల్లో..

భువనేశ్వర్: నైరుతి రుతుపవనాలు రానున్న 2, 3 రోజుల్లో పూర్తిస్థాయిలో రాష్ట్రంలో విస్తరించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) భువనేశ్వర్ కార్యాలయం సోమవారం వెల్లడించింది. దక్షిణ ద్వీపకల్పంలో కొన్ని ప్రాంతాలు, ఒడిశాలోని కొన్ని ప్రాంతాలు, పశ్చిమబెంగాల్ గంగా తీరప్రాంతాలు, జార్ఖండ్, బీహార్, తూర్పు ఉత్తర ప్రదేశ్‌లో కొన్ని ప్రాంతాలకు 2, 3 రోజుల్లో నైరుతి రుతుపవనాలు తాకేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణ కేంద్రం తెలిపింది. నైరుతి రుతుపవనాలు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ మధ్య-వాయువ్య బంగాళాఖాతం తీరంలో కొన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నాయి. పశ్చిమబెంగాల్ గంగా తీరం, జార్ఖండ్, బీహార్‌లో కొన్ని ప్రాంతాలు, ఉప-హిమాలయ బెంగాల్, సిక్కిం ప్రాంతాలకు రుతుపవనాలు త్వరలో తాకనున్నట్లు పేర్కొంది. తూర్పు భారతదేశం, పరిసర ప్రాంతాల్లో మంగళవారం నుంచి వడగాడ్పుల తీవ్రత తగ్గే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. రానున్న 3 రోజులలో పగటిపూట గరిష్ట ఉష్ణోగ్రత క్రమంగా 4 నుంచి 6డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశం ఉంది. అలాగే పలు జిల్లాల్లో వాతావరణంలో పెద్దగా మార్పు ఉండదు.



చిలికా సరస్సుపై కదులుతున్న రుతుపవనాలు

క్లుప్తంగా

జాగాకోసం కొట్లాట


చికిత్సకోసం వచ్చిన సత్యవతి

పార్వతీపురం: పార్వతీపురం మండలం బందలుప్పి గ్రామంలో జాగా కోసం ఓ కుటుంబంలో కొట్లాట జరిగింది. ఈ కొట్లాటలపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చెల్లూరు సత్యవతికి ఉన్న ఖాళీ స్థలంలో ఆమె అక్క కందకుర్తి జయమ్మ, బావ సూర్యనారాయణలు కంకరవేసి చదును చేస్తున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న సత్యవతి మా నాన్నగారు ఇచ్చిన స్థలంలో మీరు ఎందుకు కంకరవేస్తున్నారని ప్రశ్నించగా బావ సూర్యనారాయణ, అక్క జయమ్మలు సత్యవతిని తిడుతూ, దుర్భాషలాడుతూ చేయి చేసుకున్నారు. దీంతో ఆమెకు గాయాలు కావడంతో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్సకోసం చేరింది.

వివాహిత ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నం చేసిన మహిళను రక్షించిన ఫైర్, పోలీస్ సిబ్బంది

కొత్తవలస: భార్యాభర్తల మధ్య మనస్పర్థలు, ఆర్థిక లావాదేవీల కారణంగా మండలంలోని చింతలపాలెం గ్రామానికి చెందిన ఐ.కుమారి(42) సోమవారం గ్రామంలో గల వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ క్రమంలో కుటుంబసభ్యులు వారించినప్పటికీ ట్యాంక్‌పై నుంచి దూకేందుకు ప్రయత్నించింది. దీంతో ఆమె కుమారుడు చంద్రశేఖర్ తన తల్లిని రక్షించాలని కొత్తవలస ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేశాడు. దీంతో ఫైర్ స్టేషన్ ఎస్సై వై.అశోక్‌కుమార్, స్థానిక ఎస్సై వీరజనార్దన్ హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లి ఆమెకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అన్నివిధాలా హితబోధ చేసి అతి కష్టం మీద కిందికి దింపారు. ఈ సందర్భంగా ఆమె పోలీసులతో మాట్లాడుతూ తన భర్త విశాఖ పోర్టుట్రస్టులో ఉద్యోగం చేస్తున్నారని, తనను కనీసం పట్టించుకోవడం లేదని, ఆర్థికంగా ఇబ్బందులు పెడుతున్నాడని ఏకరువు పెట్టింది. తనను మానసిక వేదనకు గురిచేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పింది. ఈ తరహా తొందరపాటు నిర్ణయాలు తీసుకుని నిండుజీవితాలను నాశనం చేసుకోవద్దని పోలీసులు హితవు పలికి ఆమెకు కౌన్సెలింగ్ చేశారు. అనంతరం ఆమె తన భర్త, ఇతర కుటుంబసభ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ముగ్గురు వైద్యాధికారులకు బదిలీ

నెల్లిమర్ల: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ముగ్గురు వైద్యాధికారులకు బదిలీ జరిగింది. చిన్నపిల్లల స్పెషలిస్టు డాక్టర్ కె.శ్రీనివా సరావుకు ఆముదాలవలస సీహెచ్‌సీకి బదిలీ కాగా.. పల్మనాలజిస్ట్ సుబ్రహ్మణ్య హరికిషన్, గైనకాలజిస్ట్ భారతి పాలకొండ ఏరియా ఆస్పత్రికి బది లీ అయ్యారు. పాలకొండలో పనిచేస్తున్న గైనకాలజిస్ట్ తిరుమలదేవి బదిలీపై నెల్లిమర్ల రానున్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

- వన్‌టౌన్ సీఐ వెంకటరావు


రౌడీషీట్ కలిగిన వ్యక్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటరావు

విజయనగరం క్రైమ్: రౌడీషీటర్లు సత్రవర్తనతో మెలగాలని వన్‌టౌన్ సీఐ బి. వెంకటరావు సూచించారు. పట్టణ పరిధిలో నివసిస్తూ రౌడీషీట్ కలిగిన వ్యక్తులను సోమవారం స్టేషన్‌కి పిలిపించి అవగాహన కల్పించారు. నేర ప్రవృత్తిని విడనాడాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్సై అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


చికిత్స పొందుతున్న రామినాయుడు

పార్వతీపురం: కొమరాడ మండలం విక్రాంపురం గ్రామానికి చెందిన ఎస్. రామినాయుడు పెరుగుకోసం వెళ్లి ఇంటికి వస్తుండగా కొమరాడ నుంచి పార్వతీపురం వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో తల, కాలికి గాయాలయ్యాయి. ఈ మేరకు రామినాయుడిని చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి స్థానికులు, కుటుంబసభ్యులు తరలించారు. ఫిర్యాదు మేరకు అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కళాకారులకు ప్రభుత్వం చేయూత


వేదికపై చైర్మన్ మహేష్ పట్నాయక్, కౌన్సిలర్లు

- రాయగడ మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్

రాయగడ: రాష్ట్రంలోని కళాకారులకు ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు అమలు చేసి, వారికి చేయూత అందిస్తోందని రాయగడ మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్ అన్నారు. పట్టణంలోని బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో ఒడిశా భాష, సాహిత్యం సంస్కృతి విభాగం తరుపున జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి సుచిత్ర బౌవురి ఆధ్వర్యంలో లోక్ కళా దినోత్సవం-23ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఏటా జిల్లా యంత్రాంగం లోక్ కళా దినోత్సవాన్ని నిర్వహిస్తోందని గుర్తుచేశారు. దీనివల్ల కళాకారుల ప్రతిభకు అద్దం పట్టడంతో పాటు తగిన ప్రోత్సాహం ఇవ్వడం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. జిల్లాలో కళలను నమ్ముకుని ఎంతోమంది జీవనోపాధి పొందుతున్నారన్నారు. అయితే వారి ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంటుందని విచారం వ్యక్తం చేశారు. ఎంతోమంది కళాకారుల ఆర్థిక పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. వారిని ఆదుకునే లక్ష్యంతో ప్రభుత్వం పింఛన్ పథకాన్ని అమలు చేసిందని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 200మంది కళాకారులకు పెన్షన్ అందుతుండగా.. అదనంగా మరో 300మందిని పథకంలో చేర్చుతున్నట్లు ప్రకటించారు. ఇకపై వారందరికీ ప్రతి నెలా రూ.1,200ల అందనుందని వివరించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారుల సాంస్కృతిక విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ శుభ్రా పండా, కౌన్సిలర్లు, కళాకారులు హాజరయ్యారు.


కార్యక్రమానికి హాజరైన కళాకారులు

విపత్తులను ధైర్యంగా ఎదుర్కొందాం


సమీక్షలో మాట్లాడుతున్న ఏడీఎం ప్రియరంజన్, హాజరైన అధికారులు

- ఏడీఎం ప్రియరంజన్ పృష్టి పిలుపు

బరంపురం: రానున్న వర్షాల సీజన్‌కు ఇప్పటికే సన్నద్ధం కావాలని, ప్రకృతి విపత్తులను ధైర్యంగా ఎదుర్కోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రియరంజన్ పృష్టి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రం ఛత్రపూర్‌లోని కలెక్టర్ కార్యలయ సమావేశ మందిరంలో జిల్లా పాలనా యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రకృతి వైపరిత్యాలపై జిల్లాస్థాయి సమీక్ష సమావేశం ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఎం మాట్లాడుతూ ఫైలిన్, హుద్‌హుద్, తిత్లీ, ఫొని తదితర తుఫాన్లు, అనంతరం వచ్చిన వాయుగుండాలు గంజాం జిల్లాలో ఎంతో ప్రభావం చూపాయని తెలిపారు. అలాగే జిల్లాను భారత వాతావరణ శాఖ సైక్లోన్ జోన్‌గా ప్రకటించిందని గుర్తుచేశారు. తరచుగా తుఫాన్లు, భూకంపం, అగ్ని ప్రమాదాలు వస్తున్నాయని, వీటికి మానవాళి తప్పిదమే ముఖ్య కారణమని అభిప్రాయం వ్యక్తంచేశారు. ఇప్పటికే పచ్చదనం కోల్పోయి ఎంతో నష్టపోయామన్నారు. ప్రకృతి విపత్తులను మాత్రం ఎదుర్కోక తప్పదని స్పష్టంచేశారు. దీనిపై అంతా శిక్షణ తీసుకోవడంతో పాటు సముద్ర తీరం, లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇందులో స్వచ్ఛంద సంస్థల సహకారం కూడా వినియోగించాలన్నారు. దీనితో పాటు విపత్తు కారణంగా వచ్చే వ్యాధులపై నిత్యం అప్రమత్తంగా ఉండాలని అంగన్‌వాడీ, వైద్య సిబ్బందికి సూచనలందించారు. అగ్నిమాపక విభాగానికి చెందిన ఓడ్రాఫ్ సాయంతో వరదలు వచ్చిన సమయంలో ఏ విధంగా ఎదుర్కోవాలో యువకులకు శిక్షణ ఇవ్వాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉన్నతాధికారులు, తహసీల్దార్లు, బీడీఓలు పాల్గొన్నారు.

జేఈ ఇంటికి సీల్

- బహనాగా బజార్ రైలు ప్రమాదంలో సీబీఐ దర్యాప్తు ముమ్మరం


జేఈ ఇంటి ఆవరణలో పోలీసు బందోబస్తు

భువనేశ్వర్: బాలాసోర్ జిల్లా బహనాగా బజార్ రైల్వేస్టేషన్ రైలు దుర్ఘటన దర్యాప్తు సరికొత్త మలుపు తిరిగింది. సొరొ సెక్షన్‌లో జూనియర్ ఇంజినీర్(సిగ్నల్)గా విధులు నిర్వహిస్తున్న అమీర్‌ఖాన్ ఇంటిపై సీబీఐ వర్గాలు సోమవారం దాడులు చేపట్టాయి. ఈ నేపథ్యంలో ఆయన నివాస భవనానికి సీల్ చేశారు. సొరొ అన్నపూర్ణ రైస్ మిల్లు సమీపంలో అద్దె ఇంట్లో ఆయన నివాసం ఉంటున్నారు. ఇద్దరు సభ్యుల సీబీఐ సిగ్నల్ బృదం ఖాన్ అద్దె ఇంటిపై దాడి చేసి, సీల్ చేయడంతో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. ఈనెల 2న రైలు ప్రమాదం జరిగిన అనంతరం ఇంజినీర్ తన కుటుంబంతో పాటు అద్దె ఇంటి నుంచి అదృశ్యమైనట్లు వదంతులు వినిపించాయి. అయితే దర్యాప్తులో భాగంగా సీబీఐ వర్గాలు ఆయనను ప్రశ్నించినట్లు సమాచారం. పలువురు రైల్వే సిబ్బందిని సైతం సీబీఐ బృందం విచారణ చేపట్టింది. దుర్ఘటన పరిసరాల్లో పలు ప్రాంతాల్లో ప్రత్యక్షంగా క్షేత్ర పరిశీలన చేపట్టింది. ఈ వ్యవహారం పూర్తి చేసుకుని ఈనెల 16న బాలాసోర్ నుంచి తిరిగి వెళ్లింది. సోమవారం అకస్మాతుగా దర్యాప్తు బృందం సభ్యులు తిరిగి వచ్చి జూనియర్ ఇంజినీర్(సిగ్నల్) అమీర్‌ఖాన్ ఇంటిని సీల్ చేయడం పలు సందేహాలకు తావిచ్చింది. దుర్ఘటనలో రెండు ప్రయాణికుల రైళ్లు, గూడ్స్ రైలు చెల్లాచెదురై 292 మంది మరణించారు. 1,100 మందికి పైగా గాయపడ్డారు.

విద్యుత్ కోతలపై కాంగ్రెస్ నిరసన

- గ్రిడ్కో కార్యాలయం ముట్టడి విఫలయత్నం


గ్రిడ్కో కార్యాలయం ముట్టడికి ప్రయతిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

భువనేశ్వర్: రాష్ట్రంలో అప్రకటిత విద్యుత్ కోతలపై రాష్ట్ర కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన వ్యక్తంచేశారు. రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ లోని గ్రిడ్కో కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయం ముట్టడికి విఫలయత్నం చేసి, కోడిగుడ్లు, టమోటాలు రువ్వి నిరసన ప్రదర్శించారు. రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(పీసీసీ) అధ్యక్షుడు శరత్ పట్నాయక్ నేతృత్వంలో జరిగిన ప్రదర్శనలో పార్టీ ఎమ్మెల్యేలతో పాటు వందలాది మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 నుంచి 45 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతున్నాయని గుర్తుచేశారు. ప్రజలు భరించలేని వేడితో సతమతమవుతున్న తరుణంలో అప్రకటిత విద్యుత్ కోత ప్రాణాపాయ పరిస్థితి వంటి వైపరీత్యాలను ప్రేరేపిస్తోందని ఆరోపించారు. గ్రామాల్లో 2, 3 రోజులు నిరవధికంగా సరఫరా నిలిపి వేయడం అత్యంత విచారకరమని వ్యాఖ్యానించారు.


శిబిరంలో పీసీసీ చీఫ్ శరత్ పట్నాయక్, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల నిరసన ప్రదర్శన

విద్యుత్ మిగులు రాష్ట్రంగా ఉన్నప్పటికీ ప్రజలు కరెంట్ కోతలకు గురి కావడం ఖండనీయమన్నారు. 2024లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దీనిపై చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చిన పీసీసీ అధ్యక్షుడు.. బకాయి విద్యుత్ బిల్లులపై విధించే వడ్డీని చెల్లించవద్దని ప్రజలను పిలుపునిచ్చారు. విద్యుత్ బిల్లులు నిర్ణీత తేదీలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే జిల్లా, సబ్ డివిజన్ స్థాయిలో ఆందోళనలు చేస్తూనే ఈ అంశంపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు

శబరీ నదిలో భారీ చేప


భారీ సైజులో ఉన్న క్యాట్ ఫిష్


వలకు చిక్కిన చేపను ఒడ్డుకు మోసుకు వస్తున్న మత్స్యకారులు

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి క్యేంగ్ గ్రామం సమీపంలోని శబరీ నదిలో వల విసిరిన మత్స్యకారులకు భారీ చేప చిక్కింది. సోమవారం తెల్లవారుజామున నదిలో వేటకు వెళ్లిన వారు.. వల విసరగా క్యాట్ ఫిష్ దక్కింది. అయితే తొలుత భయాందోళన చెందిన మత్స్యకారులు.. అనంతరం జాగ్రత్తగా ఒడ్డుకు చేర్చారు. దీనికి తూకం వెయ్యగా, 60కిలోలు ఉన్నట్లు తెలిపారు. అయితే సముద్రంలో మాత్రమే ఇంత భారీ సైజులో చేపలు ఉంటాయని ఇలా నదిలో దొరకడం చాలా అరుదని చెప్పుకొచ్చారు. దీనిపై వారు ఆనందం వ్యక్తంచేశారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

బొండపల్లి: మండలంలోని బోడసింగిపేటలో ఉంటున్న శరకాన సత్యనారాయణ(45) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై ఎస్.రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మెంటాడ మండలం, గుర్ల గ్రామానికి చెందిన శరకాన సత్యనారాయణ కొన్ని సంవత్సరాల క్రితం తన అత్తవారి ఊరు బోడసింగిపేట గ్రామానికి వచ్చి టీకొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం పురుగు మందు తాగి అపస్మాకర స్థితికి చేరుకున్న సత్యనారాయణను విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కొడుకు ఉన్నారు.

అత్యాశతో ఆన్‌లైన్ మోసాలకు గురికావద్దు

- ఎస్పీ ఎం.దీపిక


ఎస్పీ ఎం.దీపికకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్న దామోదర్

విజయనగరం క్రైమ్: అత్యాశకు పోయి ఆన్‌లైన్ మోసాలకు గురికావద్దని ఎస్పీ ఎం.దీపిక హితవు పలికారు. మెరకముడిదాం మండలం పులిగుమ్మి గ్రామానికి చెందిన బూర్లి దామోదర్ చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్నాడు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి సోమవారం దామోదర్ వచ్చి, తనలా ఇంకెవరూ ఆన్‌లైన్ మోసాలకు గురికాకూడదని ప్రజలకు విజ్ఞప్తి చేశాడు. ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో గుర్తు తెలియని వ్యక్తులు తనకు వాట్సాప్‌కు మెసెజ్ పంపగా, తాను స్పందించడం వల్ల మోసపోయానన్నాడు. ఏప్రిల్ 15 నుంచి 27 వరకూ గుర్తు తెలియని వ్యక్తులకు రూ.9.25 లక్షలను పది సార్లు పంపించానని చెప్పాడు. ఆన్‌లైన్‌లో ట్రేడింగ్ చేయడం ద్వారా పెట్టిన పెట్టుబడికి 30 శాతం లాభాలు ఇస్తామని, గుర్తు తెలియని వ్యక్తులు చెప్పిన మాటలు నమ్మి, వారు పంపిన లింకులకు డబ్బులు జమచేశానన్నాడు. మొదట్లో తాను పెట్టిన చిన్న మొత్తాలకు నమ్మకం కలిగించేందుకు లాభాలను పంపిన సదరు వ్యక్తులు, ఎక్కువ మొత్తంలో నగదు పంపినప్పుడు ఇంకా డబ్బులు పంపాలని, పదే పదే మెసెజ్‌లు చేయడం, తనకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకపోవడం , తన డబ్బులు ఇవ్వడానికి మరో రూ. 5 లక్షలు ఇవ్వాలని చెప్పడంతో తాను మోసపోయినట్లు గుర్తించానన్నాడు. వెంటనే బుదరాయవలస పోలీసు స్టేషన్‌లో ఆధారాలతో ఫిర్యాదుచేయడంతో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారని, చీపురుపల్లి సీఐ జి.సంజీవరావు ఆధ్వర్యంలో పోలీస్ బృందం తాను అందించిన వివరాలతో ఆన్‌లైన్ మోసగాళ్ల వివరాలు సేకరించి, తాను పోగొట్టుకున్న రూ. 9.25 లక్షల్లో రూ.8.24 లక్షలు రికవరీ చేశారని చెప్పాడు. తనలా ఇంకెవరూ అత్యాశతో ఆన్‌లైన్ మోసాలకు గురికావద్దని, అపరిచిత వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసి, ఎస్పీ ఎం.దీపికకు కృతజ్ఞతలు తెలిపాడు.

అందరూ అప్రమత్తంగా ఉండాలి

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని, గుర్తు తెలియని వ్యక్తులు పంపే లింకులు, మెసేజ్‌లు, ఈ మెయిల్స్‌కు స్పందించవద్దన్నారు. సైబర్ మోసాలకు గురైతే, వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లోనూ, 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

విశ్వవిఖ్యాత.. యాత్రకు వేళాయె


కొరాపుట్: మెయిన్ రోడ్డులో యాత్రకు సిద్ధంగా ఉన్న రథాలు

- రాష్ట్రవ్యాప్తంగా సుందరంగా ముస్తాబైన జగన్నాథ ఆలయాలు
- యాత్ర ఘనంగా నిర్వహించేందుకు యంత్రాంగం సన్నద్ధం


పర్లాకిమిడి: నేత్రోత్సవంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

బరంపురం: జగన్నాథుని రథయాత్రకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మందిరాలు సుందరంగా ముస్తాబయ్యాయి. మరోవైపు యాత్ర సజావుగా సాగేందుకు, పోలీసు, అధికార యంత్రాంగం సంయుక్తంగా చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో బరంపురం నగరంలోని బెజ్జిపూర్ మెయిన్, కస్పా వీధి, మిలటరీ లైన్, ఉత్కళ్ ఆశ్రమ రోడ్డు, కోర్టుపేట జంక్షన్, బాలింకేశ్వర్‌పేట, పాతలేశ్వర్‌లోని జగన్నాథ చతుర్థా మూర్తులు నవయవ్వన రూపంలో భక్తులకు సోమవారం దర్శనమిచ్చారు. ఈ నేపథ్యంలో యాత్ర నిర్వహన కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీక్షేత్ర రథయాత్ర సందర్భంగా బెజ్జిపూర్ లోని నీలకంఠ నగర్ 3వ లైన్‌లో నివాసం ఉంటున్న సైకతశిల్పి సత్యనారాయణ మహరాణ తన కళా నైపుణ్యంతో ఆకట్టుకున్నారు. 8 గ్రాముల బరువు, 2.5 అంగులాల పొడువు, 2 అంగులాల వెడల్పుతో తయారు చేసిన సూక్ష్మ రథాలు నగరవాసులను ఆకర్షించాయి.


బరంపురం: సత్య మహరాణా రూపొందించిన సూక్ష్మ రథం


బరంపురం: ఆకట్టుకుంటున్న అతిచిన్న రథాలు

సిద్ధమైన శబరి శ్రీక్షేత్రం..

కొరాపుట్: దక్షిణ ఒడిశాలో మరో పూరీగా భక్తుల పూజలందుకుంటున్న కొరాపుట్ జగన్నాథ శబరి శ్రీక్షేత్ర మందిరం రథయాత్రకు సిద్ధమైంది. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ జంక్షన్ వద్ద రథాలను అందంగా తీర్చిదిద్దారు. దండకారణ్య గిరిజనులకు ప్రాధాన్యం ఉన్న ఈ రథాయాత్రలో వేలాది మంది భక్తులు పాల్గొంటారు. ఈ నేపథ్యంలో జాతీయ రహదారిలో వాహనాలు మళ్లిస్తున్నారు. జిల్లా కలెక్టర్ అబ్దుల్ మహ్మద్ అక్తార్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.


కొరాపుట్: అందంగా సిద్ధమైన కొరాపుట్ శబరి శ్రీక్షేత్రం


పర్లాకిమిడి: రాజవీధిలో ముస్తాబయిన బొడొదండొ

భక్తుల తాకిడి..

పర్లాకిమిడి: దేవస్నాన పౌర్ణమితో అస్వస్థతకు గురైన జగన్నాథుడు.. గగ 15రోజులుగా చీకటి గదిలో రాజవైద్యులు పర్యవేక్షణలో కోలుకున్నాడు. సోమవారం నవయవ్వన రూపంలో భక్తులకు దర్శనంభాగ్యం కల్పించారు. నారాయణుడుతో సహా సోదరి సుభద్ర, సోదరుడు బలభద్రులు రథయాత్రకు సిద్ధమయ్యారు. అలాగే గుండిచా యాత్రకు సర్వాంగ సుందరంగా రంగవల్లులతో బొడొదండొ చిత్రీకరించారు. పూలమాలలతో మూడు రథాలను అలంకరించారు.

క్లుప్తంగా

‘ప్రణాళికాబద్ధంగా సాగు’



ఖరీఫ్ సీజన్‌పై సమీక్ష నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

టెక్కలి: ఈ ఖరీఫ్ సీజన్‌లో టెక్కలి డివిజన్‌లో వ్యవసాయం ప్రణాళికాబద్ధంగా జరిగేలా అధికారులు చొరవ చూపాలని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం డివిజన్ స్థాయిలో వ్యవసాయ, రెవెన్యూ, వంశధార అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పుష్కలంగా విత్తనాలు, ఎరువులు అందేలా చూడాలని అన్నారు. అలాగే భూసార పరీక్షలకు అనుగుణంగా ఆయా పంట భూములకు ఎలాంటి విత్తనాలతో అధిక దిగుబడులు వస్తాయో అవగాహన కల్పించాలని తెలిపారు. కౌలు రైతులకు అందజేయనున్న పంట సాగు హక్కు పత్రాలపై ఆయా భూముల యజమానులకు, కౌలు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఖరీఫ్ సాగు ప్రణాళికపై గ్రామస్థాయిలో గ్రామసభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

కొత్తమ్మ తల్లి ఆదాయం బ్యాంకులో డిపాజిట్

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లి ఆలయ ఆదాయాన్ని బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆలయానికి నిత్యాన్నదానం కోసం విరాళాలు, మూలనిధి వడ్డీ ద్వారా వచ్చిన ఆదాయం రూ.5లక్షలను కోటబొమ్మాళి యూనియన్ బ్యాంకులో సోమవారం ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు ఆలయ ఈఓ వి.రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రూ.15,99,439లు ఎఫ్‌డీ చేశామని ఆయన పేర్కొన్నారు.

విపత్తులు ఎదుర్కొనేందుకే శిక్షణ



కిట్లను అందజేస్తున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: విపత్తులు ఎదుర్కొనేందుకు శిక్షణ ఉపకరిస్తుందని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. ఆపద మిత్ర వలంటీర్ల శిక్షణ కార్యక్రమం ముగింపు అనంతరం వారికి సోమవారం కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ 12 రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు జరిగాయన్నారు. ఏటా విపత్తులు సంభవించేటప్పుడు ప్రాణ, ఆస్తినష్టాలను తగ్గించడానికి వలంటీర్ల సాయం తీసుకుంటామని చెప్పారు. మొదటి విడతలో మొత్తం 86 మంది వలంటీర్లు, రెండో విడత శిక్షణలో 100 మంది మూడో విడతలో 80, నాల్గో విడతలో 84 మంది వలంటీర్లు శిక్షణలో పాల్గొన్నారని తెలిపారు. జిల్లాలో మొత్తం 350 మంది శిక్షణ పొందారన్నారు.

సీఎస్‌డీఎంగా శ్రీనివాస్

శ్రీకాకుళం పాత బస్టాండ్: పౌర సరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్‌గా శ్రీనివాస్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన అన్నమయ్య జిల్లాలో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. బదిలీపై జిల్లాకు వస్తున్నారు. మరో రెండు రోజుల్లో విధుల్లో చేరనున్నారు. ఇప్పటివరకు ఉన్న జిల్లా మేనేజర్ పి.జయంతి సస్పెండ్ అయిన విషయం తెలిసిందే.

పరిష్కరించాలి



స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్పందన, ఏపీ సేవ, మీ సేవ కింద అందిన అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఇన్‌చార్జి డీఆర్‌ఓ మురళీకృష్ణ, ప్రత్యేక ఉప కలెక్టర్ జయదేవి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్ అర్జీలు స్వీకరించారు. ఈ వినతులను సకాలంలో పరిష్కరించాలని జేసీ ఆదేశించారు. జగనన్నకు చెబుదాం వెబ్‌సైట్ ద్వారా, జగనన్నకు చెబుదాంలో 1902 నంబర్‌కు ప్రజలు సమస్యలను చెబుతున్నారని, వాటిని గడువులోగా పరిష్కరించాలని చెప్పారు. రీ సర్వే పూర్తయిన సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి, డీఎస్‌ఓ వెంకటరమణ, డ్వామా పీడీ చిట్టిరాజు, జిల్లా పరిషత్ సీఈఓ వెంకట్రామన్, అన్ని శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

మారిన బతుకులు

- పరివర్తన్-2.0 కింద ఆరుగురికి డీఆర్‌డీఏ లోన్లు
- గౌరవంగా బతుకుతామంటున్న లబ్ధిదారులు



రూ. 3.90 లక్షల నగదు చెక్కును అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : సమాజంలో చెడుదోవన వెళ్తున్న వారికి దండించడం ఓ మార్గం. వారి బతుకు బాటను మార్చుతూ చర్యలు తీసుకోవడం మరో మార్గం. జిల్లా పోలీసులు రాధిక రెండో మార్గాన్ని ఎంచుకున్నారు. సారా తయారీ, రవాణా, క్రయవిక్రయాలు చేసే వారిని పట్టుకుని వారిని మార్చడానికి ప్రభుత్వం ఆపరేషన్ పరివర్తన్-2.0 చేపట్టింది. కార్యక్రమంలో భాగంగా వారికి ఉపాధి కల్పించాలని నిర్ణయించింది. ఆ మేరకు సత్ప్రవర్తనతో ప్రత్యామ్నాయ జీవనోపాధి పొంది ఆదర్శంగా నిలవాలని ఎస్పీ జీఆర్ రాధిక పిలుపునిచ్చారు. అలా ముందుకు వచ్చిన ఆరుగురికి రూ. 3.90 లక్షలు చెక్కు, ధ్రువీకరణ పత్రాలను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశాలతో సెబ్ జేడీ విజయ నాగ మణికంఠ, డీఆర్‌డీఏ డైరెక్టర్ డీపీ విద్యాసాగర్‌ల సమక్షంలో ఎస్పీ సోమవారం అందజేశారు. ఇలా 20 మందిని గుర్తించామని, అందులో ఆరుగురికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశం డిస్ట్రిక్ట్ రూరల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ తరఫున అర్హత ఉండటంతో అధికారులతో కలిసి ఈ సొమ్ము లోనుగా ఇప్పించామన్నారు. మంచి వ్యాపారాలు చేసుకుని గౌరవంగా బతకాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఇచ్చిన రుణంతో జీవనం సాగించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. రుణం పొందిన తర్వాత తిరిగి బ్యాంకుకు చెల్లించిన నాడే మరోసారి బ్యాంకులు ఎక్కువ రుణాలిచ్చేందుకు ముందుకొస్తాయన్నారు. అనంతరం లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తూ యూనిట్‌కు నిర్దేశించిన లోను మొత్తం బ్యాంకువారు జమచేస్తారన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణరావు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అసిస్టెంట్ సూపరింటెండెంట్ కేవీ గోపాల్, సీఐ నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

కిరాణా షాపుగా మారుస్తా..



నా గతం ఓ పీడకల.. మర్చిపోదామనుకున్నా. నేను ప్రస్తుతం చిన్న పాన్‌షాపు నడుపుతున్నాను. రూ. లక్ష లోను జిల్లా కలెక్టర్, ఎస్పీ సార్లు ఇప్పించారు. వచ్చిన డబ్బులతో కొద్దిగా పెద్దదిగా కిరాణాషాపుగా మారుద్దామనుకుంటున్నా. – సుబుధి రాజు, సోంపేట

దినసరి కూలీగా ఉన్నా..



దినసరి కూలీగా పనిచేస్తున్నా. చాలీ చాలని డబ్బులతో కుటుంబాన్ని ఈదడం కష్టంగా ఉంది. రూ. 40 వేలు లోను ప్రభుత్వం ఇప్పించింది. దీంతో చిన్న కిరాణా షాపు పెట్టుకుంటా. – సవర సోమేశ్వర్రావు, కొత్తూరు మండలం

కిరాణా షాపు నడుపుతా..



గతంలో నేను నాటుసారా అమ్మకంలో దొరికిపోయాను. సంఘంలో గౌరవంగా బతుకుదామనుకుంటున్నా. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు మా గురించి ఆలోచించి లోను రూ. లక్ష ఇప్పించారు. దీంతో నేను కిరాణాషాపు నడిపి అందులో జీడిపిక్కల వ్యాపారం చేద్దామనుకుంటున్నా. – లాభాల మీనాక్షి, లింగుపురం, మెళియాపుట్టి మండలం

మేకలు కొనుక్కుంటా..



నాటుసారా అమ్ముతూ పట్టుబడ్డాను. మా ఏరియా పోలీసులు మారాలన్నారు. నాకు గవర్నమెంటు లోను ఇప్పించారు. రూ. 50 వేలు దొరుకుతుంది. నా దగ్గర మరి కొంత సొమ్ము ఉంది. దాంతో మేకలు, గొర్రెలు కొని జీవనం సాగిస్తా. – కాకర్ల దాలయ్య, కంచిలి మండలం, ఇచ్ఛాపురం

‘టాపర్లకు అండగా ఉంటాం’



వరుణ్ చక్రవర్తికి శాలువా కప్పుతున్న ఎమ్మెల్యే

నరసన్నపేట: పలు పోటీ పరీక్షల్లో టాపర్లుగా నిలుస్తున్న విద్యార్థులకు వైఎస్ జగన్ సర్కారు అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నరసన్నపేట నియోజకవర్గం పోలాకి మండలానికి చెందిన బోర వరుణ్ చక్రవర్తి జిల్లా ఖ్యాతినే కాకుండా రాష్ట్ర గౌరవాన్ని నిలిపారని ఎమ్మెల్యే అన్నారు. నీట్ పరీక్షలో దేశంలోనే మొదటి ర్యాంకు సాధించిన వరుణ్ చక్రవర్తికి స్థానిక ఒక కల్యాణ మండపంలో సోమవారం సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక మధ్య తరగతి కుటుంబానికి చెందిన వరుణ్ చక్రవర్తి తన కృషితో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ ఘనత సాధించారని అభినందించారు. సీఎంతో కలిపిస్తాను అని చక్రవర్తికి మాట ఇచ్చారు. ఈ సందర్భంగా పాతపట్నంకు చెందిన రామరాజు ట్రస్టు ఆధ్వర్యంలో కూడా చక్రవర్తిని సన్మానించారు. అలాగే ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావులు కూడా వేర్వేరుగా సత్కరించారు.

‘వేతనసవరణ వెంటనే అమలు చేయాలి’



డీసీసీబీ వద్ద ధర్నా చేస్తున్న సహకార సంఘ ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: వేతన సవరణను వెంటనే అమలు చేయాలని ప్రాథమిక సహకార సంఘాల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.రంగనాథ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, శ్రీకాకుళం సహకార సంఘ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎల్.మోహన్‌రావు, బి.రామారావులు డిమాండ్ చేశారు. సోమవారం శ్రీకాకుళంలోని దండివీధి వద్దనున్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఎదుట పీఏసీఎస్ ఉద్యోగులు, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఓ 90 ప్రకారం వేతనాలను, ఇతర బెనిఫిట్లను వెంటనే అమలు చేయాలని, ఏప్రిల్ 1, 2016 నుంచి మోనటరీ బెనిఫిట్స్ చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాడ్యుటీని చట్ట ప్రకారం అమలు పరచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సహకార బ్యాంకు, జిల్లా కేంద్ర బ్యాంకులు కలసి డిస్ట్రిక్ట్ లెవెల్ సపోర్ట్ ఫండ్ ఏర్పాటు చేయాలన్నారు. సహకార సంఘాలలోని ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. అనంతరం డీసీసీబీ సీఈఓ డి.వరప్రసాద రావుకు యూనియన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

ఇచ్ఛాపురం: వక్ఫ్ బోర్డు స్థలంలో జరిగిన ఆక్రమణలను తొలగించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయనున్నట్లు వక్ఫ్ బోర్డు స్పెషల్ టాస్క్‌బోర్డు అధికారి ముసాబిన్ ఇబ్రహీం, ఎగ్జిక్యూటివ్ అధికారి అబ్దుల్ కుద్దూస్ తెలిపారు. పట్టణంలోని వక్ఫ్ బోర్డుకి చెందిన ఆస్తులను పరిశీలించి వాటిపై అధికారులు ముస్లి పెద్దలతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీర్లపంజా భూముల ఆక్రమణలు, ముతవల్లిపై వచ్చిన ఫిర్యాదు మేరకు మతపెద్దలందరితో సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో షాదీ ఖానా ఏర్పాటుచేయాలన్న ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించారు.

వేరు శనగ విస్తీర్ణం పెంచేందుకు కృషి



రైతులతో ముఖాముఖిలో పాల్గొన్న నీతి ఆయోగ్ డిప్యూటీ డైరెక్టర్ అనురాధ

కోటబొమ్మాళి: వేరు శనగ సాగు విస్తీర్ణం, దిగుబడులు పెంచేందుకు కృషి చేయాలని నీతి ఆయోగ్ డిప్యూటీ డైరెక్టర్ బి.అనురాధ రైతులు, వ్యవసాయాధికారులకు సూచించారు. కోటబొమ్మాళి మండలం వాండ్రాడ గ్రామంలో సోమవారం రైతులతో ముఖాముఖి నిర్వహించారు. వేరుశనగ సాగు విస్తీర్ణం, ప్రభుత్వ తోడ్పాటుపై రైతులతో చర్చించారు. విస్తీర్ణంతో పాటు దిగుబడులు పెంచేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఓలు ఎస్.గోవిందరావు, ఇందుమతి, వాండ్రాడ వ్యవసాయ సహాయకుడు ఏఎస్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆదిత్యుని ఆలయ భూముల వేలం నేడు

- తొలి దశలో 26.55 ఎకరాల వ్యవసాయ భూముల గుర్తింపు
- నేడు ఐదు గ్రామాల్లో ఒకే రోజున వేలం ప్రక్రియ



వేలానికి సిద్ధమైన అరసవల్లి సమీపంలోని భూములు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ భూములను మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బహిరంగ వేలం వేయనున్నారు. ఈ ఆలయానికి చెందిన సుమారు 26.55 ఎకరాల వ్యవసాయ భూములను లీజు విధానం ద్వారా సేద్యం చేసుకునేందుకు మూడేళ్ల కౌలు హక్కుల కోసం టెండర్ కం బహిరంగ వేలం ప్రక్రియను ఆయా ఊళ్లలో నిర్వహించనున్నారు. దీంతో ఆలయానికి 2023–24 నుంచి 2025–26 వరకు కౌలు హక్కుదారుల నుంచి మరింత ఆదాయం సమకూరనుంది.

అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి మొత్తం 83.99 ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. అయితే వీటిలో 53.24 ఎకరాల భూములు ఆలయ అర్చకులకు జీతాలకు బదులుగా వారి ఆధీనంలో ఉండేలా దేవదాయ శాఖ ఉన్నతాధికారులు గత కొన్ని దశాబ్దాల కిందటే అప్పగించి ఉన్నారు. ఇక మిగిలిన భూమిలో ఏపీ టూరిజం హోటల్‌కు 1.48 ఎకరాలు, టీటీడీ కల్యాణ మండపానికి 1.20 ఎకరాలు కేటాయించగా, మాస్టర్ ప్లాన్ అమలులో ఇళ్ల బాధితులకు 0.16 సెంట్లలో కొత్త ఇళ్ల కోసం కేటాయింపులు చేశారు. దీంతో మిగిలిన 27.91 ఎకరాల భూముల్లో తొలి దశలో 26.55 ఎకరాల వ్యవసాయ భూములను వేలం ద్వారా కౌలు హక్కుల కింద మూడేళ్ల పాటు ఇవ్వనున్నారు. అయితే ఇదే వేలం ప్రక్రియ ప్రతి మూడేళ్లకు ఒకసారి బహిరంగ వేలం వేస్తూ.. దాయాన్ని పెంపొందించుకోవాల్సి ఉంది. అయితే 2007లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఆలయ భూములను వేలం ప్రక్రియ వేయగా.. తర్వాత వచ్చిన ప్రభుత్వాల హయాంలో ఈ ప్రక్రియను కొనసాగించలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2020లో ఈ భూములకు భూముల వేలం ద్వారా ఆలయాల భూముల సంరక్షణకు కృషి చేశారు. మళ్లీ నిబంధనల ప్రకారం మూడేళ్ల కాలపరిమితి మించిన కారణంగా తాజాగా మంగళవారం ఈ భూములకు బహిరంగ వేలం ప్రక్రియను నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు అరసవల్లి, వప్పంగి, వాడాడ, రాయిపాడు, చింతాడ తదితర గ్రామాల్లో ఉన్న భూములకు ఆయా పంచాయతీల పరిధిలోనే వేలం నిర్వహించేలా చర్యలు చేపట్టారు.

పూర్తి పారదర్శకంగా వేలం ప్రక్రియ

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి చెందిన 26.55 ఎకరాల భూములకు ఈనెల 20న పూర్తి పారదర్శకంగా బహిరంగ వేలం ప్రక్రియ నిర్వహించనున్నాం. దీని ద్వారా రైతులకు రానున్న మూడేళ్ల పాటు సేద్యం చేసుకునే అవకాశం కల్పించనున్నాం. అయితే ఈ వేలం ప్రక్రియలో హిందువులు మాత్రమే హాజరుకావాలనే నియమాన్ని కచ్చితంగా అమలు చేస్తున్నాం. అలాగే రైతులందరికీ సమాచారం ఇచ్చాం. – వి.హరిసూర్యప్రకాష్, ఆలయ ఈఓ.

బహిరంగ వేలం భూములివే...

- అరసవల్లి ఆలయ భూముల్లో తొలివిడతలో మొత్తం 26.55 ఎకరాల భూములను మంగళవారం ఒక్క రోజునే ఆయా భూములున్న గ్రామాల్లోనే వేలం ప్రక్రియను నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేశారు.
- అరసవల్లి సమీపంలో ఉన్న 0.60 సెంట్లు, 0.50 సెంట్లు విస్తీర్ణం గల భూములను వేలం ప్రక్రియను మంగళవారం ఉదయం 8 గంటలకు స్థానిక ఆదిత్యాలయంలో నిర్వహించనున్నారు. అలాగే ఉదయం 10 గంటలకు వప్పంగి గ్రామ పరిసరాల్లో ఉన్న 3.54 ఎకరాలు, 2.37 ఎకరాలు, 1.38 ఎకరాలు, 5.32 ఎకరాలు, 8.99 ఎకరాల భూములను వప్పంగిలోని శ్రీ ఉమా రామలింగేశ్వర ఆలయం వద్ద, మధ్యాహ్నం 12 గంటలకు వాడాడ గ్రామ పరిసరాల్లో ఉన్న 1.25 ఎకరాల వ్యవసాయ భూమిని వాడాడలోని శ్రీవల్లభనారాయణ స్వామి వారి ఆలయం వద్ద, మధ్యాహ్నం 2 గంటలకు రాయిపాడు పరిసరాల్లో ఉన్న 2 ఎకరాల భూమిని రాయపాడులోని శ్రీరామమందిరం వద్ద, సాయంత్రం 4 గంటలకు చింతాడ గ్రామ పరిసరాల్లోని 0.60 సెంట్ల భూమిని చింతాడలోని శ్రీరామ మందిరం వద్దనే బహిరంగ వేలం వేసేలా ఆలయ ఈఓ వి.హరి సూర్యప్రకాష్ షెడ్యూల్‌ను ప్రకటించారు.

యోగా అవగాహన పోస్టర్ విడుదల



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ నవీన్, ఇతర అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: అంతర్జాతీయ యోగా దినోత్సవంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. యోగా దినోత్సవ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ నెల 21న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. ఈ ఏడాది వసుధైక కుటుంబం నినాదంతో యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

సముద్రతీరంలో కూలిన సర్వే డ్రోన్

మందస:

మండలంలోని ఉద్దాన ప్రాంతమైన రాంపురం పంచాయతీలో బిడిమి గ్రామంలో జగనన్న శాశ్వత భూహక్కు పథకం కింద రీసర్వేను సోమవారం ప్రారంభించారు. అయితే డ్రోన్ ఎగరేశాక సాంకేతిక కారణాలతో అది కూలిపోయింది. దీంతో వీఆర్వో జె.తులసీదాసు, సర్వే ఆఫ్ ఇండియా టీం సర్వేయర్ వేముల ప్రసాదరావు, సర్వేయర్ సాలీన సుందరరావు, టాస్క్‌ఫోర్స్ సర్వేయర్ శ్రీను, విలేజ్ సర్వేయర్లు గోపి, శంకర్, ప్రశాంత్ గాలించగా.. భేతాళపురం సమీపంలోని తీరంలో డ్రోన్ శకలాలు కనిపించాయి. కానీ డ్రోన్‌లోని కెమెరా మాత్రం దొరకలేదు. దొరికిన వాటిని ఒక చోట చేర్చి, మందసలోని తహసీల్దార్ కార్యాలయానికి చేర్చారు.



భేతాళపురం తీరంలో కూలిన సర్వే డ్రోన్

అప్రమత్తతే రక్షణ కవచం



సరుబుజ్జిలి: మండుతున్న ఎండల నుంచి ఉపశమనం ఇస్తూ జల్లులు జిల్లాను పలకరించాయి. కానీ ఇదే సమయంలో అకస్మాత్తుగా వచ్చి పడుతున్న పిడుగులు ప్రాణాలను బలిగొంటున్నాయి. ఖరీఫ్ పనులు మొదలు కావడంతో రైతులంతా పొలాలకు వెళ్తుంటారు. పశువుల కాపరులు కూడా కొండ ప్రాంతాలకు వెళ్తుంటారు. వీరికి పిడుగుపాట్లతో ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అయితే కాస్త అప్రమత్తంగా మెలిగితే ప్రమాదం బారి నుంచి బయటపడవచ్చు.

ఏం చేయాలి..?



- ఉరుములు, మెరుపులతో వానలు పడేటప్పుడు చెట్ల కింద ఉండకూడదు.
- మేఘ గర్జనలు వినిపించినప్పుడు పొలాల నుంచి వెళ్లిపోవడం ఉత్తమం.




- గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు బయటకు వెళ్లకుండా ఇంటి పట్టున ఉండడం మేలు.



- మెరుపులు కనిపిస్తున్నప్పుడు సెల్‌ఫోన్లలో ఆటలు ఆడుకోవడం, ఇయర్ ఫోన్ పెట్టుకుని డాబాలపై తిరగడం వంటివి చేయకూడదు.
- మెరుపు కనిపించిన 30 సెకన్లు లేదా అంత కంటే తక్కువ సమయంలో ఉరుము వినిపిస్తే మనకు 10 కిలోమీటర్ల దూరంలో పిడుగు పడే అవకాశం ఉంటుంది.
- ఇంటిలో ముఖ్యమైన ఎలక్ట్రికల్ వస్తువులను సమయం చూసి ఆఫ్ చేయడం, ప్లగ్ కనెక్షన్ తీసి ఉంచడం వంటివి చేయాలి.



ప్రథమ చికిత్స చేయాలి



పిడుగుపాటుకు గురైన వ్యక్తిని వెంటనే పొడి ప్రదేశంలో తిన్నగా పడుకోబెట్టాలి. తడి బట్టలు తీసివేయాలి. తలను ఒక పక్కకు తిప్పాలి. రెండు కాళ్లను ఒక అడుగుపైకి ఎత్తాలి. గాలి తగిలే ప్రదేశంలో ఉంచి అవసరమైతే నోటి ద్వారా గాలి ఊది ప్రథమ చికిత్స చేయాలి. సకాలంలో ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందించాలి. – యండ భవ్యశ్రీ, వైద్యాధికారి, సరుబుజ్జిలి

పిడుగుపాటుకు వ్యక్తి మృతి



పిడుగుపాటుకు గురైన శిమ్మ తవుడు

పోలాకి: మండలంలోని చీడివలస పంచాయతీ పరిధి మాకివలస గ్రామానికి చెందిన శిమ్మ తవుడు(49) సోమవారం ఉదయం పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. వేకువజామున బహిర్భూమికి వెళ్లిన తవుడుపై పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య మహాలక్ష్మి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తవుడు మృతదేహాన్ని నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబాన్ని ఎంపీపీ ముద్దాడ దమయంతి పరామర్శించి ధైర్యం చెప్పారు.

కుశాలపురంలో..

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురంలో గురుగుబెల్లి అమ్మన్న, పైడి ప్రభావతి ఇళ్లపై సోమవారం వేకువజామున పిడుగులు పడ్డాయి. శ్లాబుపై పడటంతో ఇంటిలోని కుటుంబ సభ్యులు భయాందోళన చెందారు. శ్లాబుపై ఉన్న పిట్టగోడలు దెబ్బతిని, నిర్మాణాలు పగిలాయి.

ఇంటిపై పిడుగు

ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేటలో కారాడ కొండలరావు ఇంటిపై సోమవారం పిడుగు పడింది. శ్లాబు బీటలు ఇవ్వగా, శ్లాబ్‌పై ఉన్న గోడ ధ్వంసమైంది. ఇంటిలోని ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోయాయి.



పిడుగు పాటుకు విరిగిన శ్లాబ్‌పై గోడ

గాలులకు విరిగిన విద్యుత్ స్తంభాలు

లావేరు: మండలంలో సోమవారం వేకువజామున వాన కురవడంతో పాటు ఈదురుగాలులు వీచాయి. ఈ గాలులకు గుంటుకుపేట, చిన్నయ్యపేట, బుడతవలస గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో హెచ్‌టీ, ఎల్‌టీ లైన్లకు సంబంధించిన విద్యుత్ స్తంభాలు విరిగి పడిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. అనంతరం విద్యుత్‌శాఖాధికారులు మరమ్మతులు నిర్వహించి కరెంటు సరఫరా పునరుద్ధరించారు.



గుంటుకుపేట వద్ద విరిగిపోయిన హెచ్‌టీ లైన్ విద్యుత్ స్తంభం

కూర్మనాథుని హుండీ ఆదాయం రూ.14,98,411



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

గార: శ్రీకూర్మనాథాలయంలోని హుండీ ఆదాయం రూ.14,98,411లు వచ్చిందని ఆలయ ఈఓ జి.గురునాథం తెలిపారు. ప్రధాన ఆల యంతో పాటు సమీపంలోని పాతాళ సిద్ధేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించామని, 96 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చిందన్నారు. లెక్కింపులో ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు, పాలకమండలి సభ్యుడు డబ్బీరు వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

బొడ్డేపల్లి శత జయంతి ఉత్సవాల ముగింపు తేదీ మార్పు

టెక్కలి: బొడ్డేపల్లి రాజగోపాలరావు శత జయంతి ఉత్సవాల ముగింపును ఈ నెల 25కు మార్చినట్లు రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ ఓ ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి ఈ నెల 21న ముగింపు కార్యక్రమం జరగాల్సి ఉందని, కానీ అధికారులు, పెద్దలు అందుబాటులో లేని కారణంగా కలెక్టర్ సూచనల మేరకు 25వ తేదీకి మార్చామన్నారు. 25న ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం 7 రోడ్ల జంక్షన్ వద్ద విగ్రహావిష్కరణ, ఎన్టీఆర్ మున్సిపల్ గ్రౌండ్‌లో సభా కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు.